క్లుప్తంగా

నాగాలమ్మ కుంభాభిషేకానికి ఏర్పాట్లు

●23న పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ
●నేడు కుంభాభిషేకం



నాగాలమ్మ ఆలయం

పిచ్చాటూరు: పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో శ్రీ నాగాలమ్మ ఆలయ కుంభాభిషేక పూజలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి తెలిపారు. ఆదివారం మహా కుంభాభిషేక పూజల్లో డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం , ఎంపీ మద్దెల గురుమూర్తి పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ కుంభాభిషేక ఏర్పాట్లలో భాగంగా పరసరాల్లో చలువ పందిళ్లు, విద్యుత్ కటౌట్లు, విద్యుత్ తోరణాలతో ఆలయ పరిసర ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా నిర్వాహకులు తీర్చిదిద్దుతున్నారు.

కల్కి ట్రస్టు దౌర్జన్యాల నుంచి కాపాడండి



వరదయ్యపాళెం తహసీల్దార్‌కు విన్నవిస్తున్న కదూరు గ్రామస్తులు

వరదయ్యపాళెం: తమకు కేటాయించిన ఇంటి స్థలాల్లో అక్రమంగా కంచె ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న కల్కి యాజమాన్య దౌర్జన్యాల నుంచి తమకు రక్షణ కల్పించాలని కదూరు గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్‌కు విన్నవించారు. ఆ మేరకు 2008లో ఇంటి పట్టాలు పొందిన 68 మంది పట్టాదారులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వారికి మద్దతుగా స్థానిక సర్పంచ్ సుజాత, నానిరెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నా నిలిచారు. పట్టాలను పరిశీలించిన తహసీల్దార్ మాట్లాడుతూ.. పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించి, క్షేత్రస్థాయిలో భూములను కూడా పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు.

డిజిటల్ లావాదేవీలతో మేలు



మాట్లాడుతున్న విశ్వజ

ఏర్పేడు: డిజిటల్ బ్యాంకు లావాదేవీలను నిర్వర్తించడం ఎంతో మేలని, సమయం ఎంతో ఆదా అవుతుందని ఏర్పేడు సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ విశ్వజ అన్నారు. శుక్రవారం మండలంలోని అంజిమేడులో ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బ్యాంకు నుంచి పొందిన పంట, బంగారు రుణాలను సక్రమంగా చెల్లిస్తే మళ్లీ రుణాలు పొందవచ్చన్నారు. పొదుపు సంఘాల మహిళలు, ఖాతాదారులు తమ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంప్యూటర్ శిక్షణతో ఉజ్వల భవిత



విద్యార్థులకు ట్రైనింగ్ సర్టిఫికెట్లను ఇస్తున్న హెచ్ఎం ఆనంద్

రేణిగుంట: కంప్యూటర్ పరిజ్ఞానం విద్యార్థుల జ్ఞానాభివృద్ధికి దోహదం చేస్తుందని, తద్వారా ఉజ్వల భవితకు బాటలు వేసుకోవచ్చని కరకంబాడి హైస్కూల్ హెచ్ఎం తీగల ఆనంద్ అన్నారు. క్రై, సన్ టీవీ నెట్‌వర్క్ ఆర్థిక సాయంతో మండలంలోని కరకంబాడిలో ప్రగతి సంస్థ సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ 58మంది విద్యార్థులకు 45రోజుల పాటు కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చారు. శుక్రవారం విద్యార్థులకు ట్రైనింగ్ సర్టిఫికెట్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైన్స్, గణితం సులభతరంగా నేర్చుకునేందుకు స్టెమ్ సెంటర్లను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ కోఆర్డినేటర్లు తులసీరాంరెడ్డి, జయలక్ష్మి, ఉషారాణి, చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొన్నాలమ్మకు ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: అక్షయ తృతీయ సందర్భంగా పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హిందూ ధర్మప్రచార మండలి ఆధ్వర్యంలో పోతుల రాజ్‌కుమార్ అమ్మవారికి మాంగల్య దారాలు, రక్షా కంకణాలు, పసుపు కుంకుమ, పరదాను అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వయ్యాల కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఆనందరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

మా పంచాయతీ సమస్యలు తీర్చండయ్యా!



తిరువట్యంలో మహిళలతో మాట్లాడుతున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం: ఏళ్ల కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని తిరువట్యం గ్రామ పంచాయతీ వాసులు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని తిరువట్యం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. తిరువట్యం, ఎస్టీ కాలనీలలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల పరంగా ఆయా కుటుంబాల వ్యక్తులు పొందిన లబ్ధిని బుక్‌లెట్లతో వారికి వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీసినప్పుడు పలు సమస్యలను నివేదించారు. ఏళ్ల కాలంగా అరుణానది కాజ్‌వేకు మరమ్మతులు చేయడకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నామని ప్రధానంగా చెప్పారు. శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని ఏకరువు పెట్టారు.

కాజ్‌వే నిర్మాణానికి రూ.3కోట్లతో ప్రతిపాదనలు

ఎమ్మెల్యే మాట్లాడుతూ, తిరువట్యం, తుంబూరు, పాలమంగలం నార్త్‌ల వద్ద అరుణానదిపై దెబ్బతిన్న కాజ్‌వేల పూర్తి స్థాయి నిర్మాణానికి రూ 3 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, అనుమతులు లభించిన వెంటనే పనులకు పూనుకుంటామన్నారు. శ్మశాన దారి వివాదం కోర్టులో కేసు నడుస్తోందని, సంబంధిత రైతులతో మాట్లాడి భూసేకరణ నివేదికలు పంపాలని తహసీల్దార్ ప్రమీలను, సచివాలయ నిధుల నుంచి దళిత వాడకు తాగునీటి పైపులైన్ వేయించాలని ఎంపీడీఓ గుణశేఖర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

రూ.10 వేల విరాళం

తిరువట్యంలోని నడి వీధి గంగమ్మకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యేతోపాటు జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మే నెలలో జాతరకు హాజరు కావాలని మహిళలు వారిని ఆహ్వానించారు. వేపచెట్టు కింద ఉన్న నడివీధి గంగమ్మకు జాతర లోపు రేకుల షెడ్ ఏర్పాటు చేయాలని కోనేటి సుమన్‌కుమార్ రూ 10 వేలను మహిళలకు అందజేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు ఎమ్మెల్యేతోపాటు ప్రజాప్రతినిధులు సామూహిక సీమంతం చేయడంతోపాటు పౌష్టికాహారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ సుదర్శన రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సారకాయలు, వైస్ ఎంపీపీలు హేమమ్మ, శివశంకర్, సర్పంచ్ నాగూరు, పార్టీ నాయకులు ఏకాంబరం, సుధాబాబు, తిరువెంగడం, రజని, చీరాలయ్య, సొరకాయలురెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ధర్మయ్య(27) కుటుంబ సభ్యులకు రూ 5 లక్షల వైఎస్సార్ బీమా చెక్కును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు. 4 నెలల క్రితం నాయుడుపేట సమీపంలో చెన్నై-కోల్‌కత్తా హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ దళితవాడకు చెందిన ధర్మయ్య మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద మృతుని తల్లి వళ్లెమ్మకు రూ.5 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఏడాదికి రూ 300 బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తోందని, కుటుంబ యజమాని మృతి చెందితే వైఎస్సార్ బీమాతో ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. గత ప్రభుత్వాలు ప్రజల చేత బీమా ప్రీమియం కట్టిస్తే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తోందన్నారు.

రైతాంగం శ్రేయస్సుకు పాటుపడండి



వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలితో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిరాడంబరంగా జరిగింది. ముఖ్యఅతిథిగా తిరుపతి ఎంపీ మద్దెలగురుమూర్తి హాజరయ్యారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చైర్‌పర్సన్‌గా ఉగ్గుమూడి సంధ్య, వైస్ చైర్మన్‌గా కే.సుబ్రమణ్యంరెడ్డి, సభ్యులుగా అంకమ్మ, చిన్నమ్మ, సుమలత, హరిబాబు, ఉమామహేశ్వరి, విద్యాసాగర్, కోటేశ్వరరావు, విజయబుజ్జమ్మ, రమాదేవి, రత్నమ్మ, దశరథరామిరెడ్డి, వీరాస్వామి, ప్రభాకర్‌తో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని నూతన పాలక మండలి రైతాంగం శ్రేయస్సుకు పాటుపడాలని కర్తవ్యబోధ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లోనూ మహిళలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందన్నారు.

అనంతరం చైర్‌పర్సన్ సంధ్య మాట్లాడుతూ, అందరి సహకారంతో మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తమ కుటుంబంపై నమ్మకం ఉంచి, తన నియామకానికి కృషిచేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బరత్నమ్మ, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్సీవీ దిలీప్, రఘుపతిరెడ్డి, గవర్ల కృష్ణయ్య, దయాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రవిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ గురవయ్య, సీఐ విక్రమ్, ఎస్ఐ మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గురు సంచార పూజలు

పిచ్చాటూరు: శ్రీ మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరాలయంలో శనివారం గురు సంచార పూజను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి 11.24 గంటలకు గురు భగవాన్ మీన రాశి నుంచి మేష రాశిలోకి ప్రవేశిస్తారన్నారు. ఈ క్రమంలో ఆలయంలో కొలువై ఉన్న నవగ్రహ గురు భగవాన్‌కు పరిహార సంకల్పం, విశేష హోమాలు, అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

మహిళలకు 'రాస్' ఇఫ్తార్ విందు

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాస్ మహిళావాణి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా రంజాన్ వేడుకలను నిర్వహించారు. మహిళలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాష్ట్రీయ సేవాసమితి డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ, రంజాన్ మాసంలో ముస్లింల ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. తమ సంస్థలో కులమతాలకతీతంగా అందరినీ సమానంగా చూస్తామన్నారు. అనంతరం మత గురువులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది, క్లస్టర్ లీడర్లు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు శ్మశానంలో శుక్రవారం సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో ముళ్లపొదలను తొలగించారు. ఇక్కడ దట్టంగా ముళ్లపొదలు పెరిగిపోవడంతో మృతదేహాలను ఖననం చేయడానికి గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. వారి విజ్ఞప్తిపై సర్పంచ్ స్పందించి జేసీబీతో వాటిని తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకముని పాల్గొన్నారు.

అమర వీరులకు నివాళి

ఏర్పేడు: మండలంలోని మునగలపాలెంలో అమర వీరులకు శుక్రవారం మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు నివాళులు అర్పించారు. ఇసుక మాఫియాతో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని 2017 ఏప్రిల్ 21న అప్పటి టీడీపీ హయాంలో న్యాయం కోసం ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, లారీ ప్రమాదంలో మునగలపాలెంకు చెందిన 16 మంది రైతులు మృతిచెందగా 21 మంది తీవ్రగాయాలపాలయ్యారు. అప్పట్లో గ్రామస్తులు మృతుల స్మారకార్థం గ్రామ పొలిమేరలో అమర వీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా స్థూపం వద్ద మృతుల కుటుంబ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు నివాళులు అర్పిస్తున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమలయ్య, వైస్ ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, మాజీ ఎంపీటీసీ రమణయ్య, నాయకులు జీపీ యాదవ్ గురునాథం, కుప్పాల వెంకటేష్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ: రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని, వారికోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి రైతు బాంధవుడిగా నిలిచారని ఎంపీ గురుమూర్తి కొనియాడారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని మార్కెట్ యార్డులో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధ్యక్షతన జరిగిన నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మూడన్నరేళ్లుగా సీఎం జగనన్న రైతుపక్షపాతిగా పేరుగడించారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పరిష్కరమయ్యాయని తెలిపారు. అనంతరం నూతన పాలకమండలి చైర్మన్ ఉగ్గుమూడి సంధ్య, వైస్ చైర్మన్ కే.సుబ్రమణ్యంరెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ నేత మృతికి ఎమ్మెల్యే నివాళి

పిచ్చాటూరు: మండలంలోని వెంగళత్తూరుకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత గోపాల్ రెడ్డి గురువారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం మధ్యాహ్నం మృతుని ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయానికి గజమాల వేసి నివాళులర్పించారు.మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, సర్పంచ్ అన్నాదొరై, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ నాయకునికి పరామర్శ

శ్రీకాళహస్తి: అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణంలోని 21వ వార్డుకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు బావాజీని శుక్రవారం బియ్యపు పవిత్రారెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఫరీద్, గౌస్, సుమతి, జుంలేషా, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శుక్రవార ఉత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి శుక్రవారం ఆగమోక్తంగా శుక్రవార ఉత్సవం నిర్వహించారు. తొలుత అమ్మవారి ఉత్సవమూర్తికి పలు రకాల అభిషేకాల అనంతరం విశేష అలంకరణ చేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ అమ్మవారు చప్పరాలపై అధిష్టించారు. ఆలయ ప్రాకారంలో ఉత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల ఆందోళన



సీఆర్ఎస్ వద్ద ఆందోళన చేస్తున్న రైల్వే కార్మికులు

-పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్

రేణిగుంట: రైల్వే కార్మికులకు నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సీఆర్ఎస్ బ్రాంచ్ నాయకులు బాబు డిమాండ్ చేశారు. యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం రేణిగుంట సీఆర్ఎస్ మెయిన్ గేటు వద్ద రైల్వే కార్మికులు ఆందోళన చేశారు. నినాదాలతో హోరెత్తించారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలపై కార్మికులు ఎంతో కాలంగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని అవలంభిస్తోందని విమర్శించారు. ఇకనైనా తీరు మార్చుకోవాలన్నారు. స్పందించకపోతే ముందు ముందు ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసాద్, సదాశివరెడ్డి, ఉదయ్‌రాయ్, ముని, చంద్రశేఖర్, మణి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



పద్మ (ఫైల్)

వరదయ్యపాళెం: ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. పొలం పనులకు వెళ్లి ఇంటికి వస్తుండగా పిడుగుపాటుకు వ్యవసాయ కూలి దుర్మరణం పాలయ్యింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వరదయ్యపాలెం మండలం కురింజల్లంకు చెందిన కుప్పం మునస్వామి భార్య కె. పద్మ (40) సమీపంలోని పంట పొలాల్లో వేరుశనగ ఒబ్బిడికి కూలిగా శుక్రవారం వెళ్లింది. మధ్యాహ్నం వరకు పొలంలో పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరే సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో సంభవించిన పిడుగుపాటుకు మహిళ పద్మ అస్వస్థతకు గురైంది. దీంతో వైద్యం కోసం తరలించే లోపే ఆమె మృతి చెందింది.



గాలి వానకు కూలిన విద్యుత్ స్తంభం

కూలిన విద్యుత్ స్తంభాలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : మండలంలో శుక్రవారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. పెనుగాలులకు కంచనపల్లె, బోనుపల్లె తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మామిడి పంటకు నష్టం వాటిల్లింది.

24 నుంచి సోమనాధేశ్వరాలయ కుంభాభిషేకం



సిద్ధిరాజుకండ్రిగలో కుంభాభిషేకానికి సిద్ధమవుతున్న శ్రీ పార్వతీ సమేత సోమనాధేశ్వరాలయం (ఇన్‌సెట్) ఆలయంలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తులు

- శ్రీ లక్ష్మీగణపతి హనుమంతేశ్వరస్వామి దేవస్థానంగా నామకరణం
- రూ.2 కోట్లతో నిర్మాణం

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలో నూతనంగా నిర్మించిన శ్రీ పార్వతీ సమేత సోమనాధేశ్వర ఆలయ కుంభాభిషేకం ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆయన నిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయానికి శ్రీ లక్ష్మీగణపతి హనుమంతేశ్వర స్వామి దేవస్థానంగా నామకరణం చేశారు. ఆలయంలో పార్వతీ దేవి ఎదుట లింగ రూపంలో సోమనాధేశ్వరుడు కొలువై ఉంటారు. గ్రామంలో ఆంజనేయస్వామికి చిన్న ఆలయం ఉండేది. ఈ ఆలయం చుట్టు 0.55 సెంట్ల గుడి భూమి ఉంది. ఈ స్థలంలో పెద్ద ఆలయాన్ని నిర్మించాలనే అప్పటి గ్రామ ఉప సర్పంచ్ జ్యోతిరాజు తన సంకల్పాన్ని గ్రామస్తులకు చెప్పడంతో అందరూ దీనికి అంగీకరించారు. ఆలయ నిర్మాణానికి 2013లో భూమి పూజ చేశారు. దేశ విదేశాల నుంచి మిత్రుల నుంచి విరాళాలు సైతం సేకరించారు. రెండేళ్ల క్రితం గ్రామంలోని యువకులతో శ్రీ లక్ష్మీ గణపతి హనుమంతేశ్వరాలయ అభివృద్ధి సంఘం ఏర్పాటు చేసి అందరి సహకారంతో ఆలయ నిర్మాణ పనులను రూ.2కోట్లతో పూర్తి చేశారు. ఆలయంలో ఆంజనేయస్వామితో పాటు పార్వతీ సమేత సోమనాధేశ్వరస్వామి, లక్ష్మీగణపతి, లక్ష్మణ సమేత సీతారాములు, శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, కళ్యాణ నవగ్రహాలకు ప్రత్యేక ఆలయాలు నిర్మించారు.



ఆలయం వద్ద ఆకట్టుకుంటున్న విద్యుత్ తోరణాలు

కుంభాభిషేక కార్యక్రమాలిలా..

24,25,26వ తేదీలలో మహా కుంభాభిషేకం, 27న ఉదయం గంటలకు విమాన గోపుర కుంభాభిషేకం, సకల దేవతలకు మహా అభిషేకం, సంప్రోక్షణ, సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 8 గంటలకు శివపార్వతుల గ్రామోత్సవం, 28న సీతారాముల కల్యాణం, 29న శ్రీ వళ్లీ దేవసేన, శ్రీ సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని జ్యోతిరాజు చెప్పారు. కుంభాభిషేకం జరిగే 6 రోజుల పాటు భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేయనున్నట్టు తెలిపారు.

పూడిలో 'జగనన్నే మా భవిష్యత్తు'



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పూడి గ్రామంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని జేసీఎస్ కన్వీనర్ చెరుకు నరసింహనాయుడు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తోందని తెలియజేశారు. అనంతరం ఇళ్లు, సెల్‌ఫోన్లకు జగనన్న స్టిక్కర్లను అంటించారు. అలాగే 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గురుస్వామినాయుడు, పార్టీ నాయకులు విజయ్‌శేఖర్‌నాయుడు, సురేష్, మురళి, నాగరాజు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

నవసంధి వినాయక ఆలయాల పరిశీలన



వినాయక ఆలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలో నాలుగుమాడ వీధుల్లోని నవసంధి వినాయకస్వామి ఆలయాలను శుక్రవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, నవసంధి వినాయక స్వామి ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఆగ్నేయంగా ఉన్న వినాయకస్వామి ఆలయాన్ని పూర్తిగా తొలగించి నూతన ఆలయాన్ని నిర్మిస్తామన్నారు. అలాగే పలు ఆలయాలకు గ్రానైట్ పనులు చేయిస్తామని, ప్రతి ఆలయంలో నూతన ఎలక్ట్రికల్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న వినాయకచవితి లోపు టెండర్లు ఆహ్వానించి పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు రాజా పవన్ కల్యాణ్, కుమార్, సూర్యప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న పవిత్రారెడ్డి



గ్రాడ్యుయేషన్ పత్రాలు అందజేస్తున్న గుడ్లూరు మయూర్

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని శ్రీ ధర్మరాజుల స్వామి గుడి ఎదురుగా ఉన్న శ్రీ చైతన్య పాఠశాల బ్రాంచ్-3లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బియ్యపు పవిత్రారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి భవితకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రియాజ్, ఏజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపల్ రమణ, బాలాజీ, కేదార్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీఎం స్కూల్‌లో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలోనూ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లను డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అందజేశారు. ప్రధానోపాధ్యాయులు మునిరత్నం నాయుడు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తనపల్లెలో ఎన్ఎస్ఎస్ క్యాంప్

తిరుపతి రూరల్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-3 దత్తత గ్రామమైన తనపల్లెలో ఈనెల 21 నుంచి 27 వరకు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాన్ని కో-ఆర్డినేటర్ ఆచార్య కాత్యాయని ప్రారంభించారు. ప్రోగ్రాం అధికారిణి నీరజ, సర్పంచ్ పాల్గొన్నారు.